జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 26 | ఫిబ్రవరి | 2026 ♦ పేజీలు : 6



# బ్రెజిల్ దేశంలో లిథియం మైనింగ్ లో భాగస్వామ్యానికి సింగరేణికి ఆహ్వానం

- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసిన ప్రతినిధులు



**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** తాము చేపట్టిన లిథియం మైనింగ్ లో సింగరేణి సంస్థ భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్ దేశానికి చెందిన ప్రముఖ సి.బి.ఎల్ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి ఛైర్మన్ అండ్ ఎండీ డాక్ట ర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసి వివరాలను తెలియజేసింది. సి.బి.ఎల్ (కంపాన్హియా బ్రసిలీరా డి లిటియో) బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమే, సి.బి.ఎల్ సీఈవో వినీసియస్

మిగతా 2 లో...




6 లో..

# ఇల్లందు కనుమరుగుకు బాధ్యులేవరూ!

- అధికారుల సమన్వయ లోపమే... ఇల్లందు ఏరియాకు శాపమా?
- గత అధికారులు ఏరియా మనుగడ కోసం ఆరాటం!
- భారీగానే కార్మికులు డిప్యూటేషన్ పై బదిలీలు
- డిప్యూటేషన్ పై బదిలీలలో పాటించని నియమనిబంధనలు?
- పూసపల్లి ఓసి ప్రారంభానికి మోక్షమెప్పుడో!
- కొన్ని కార్మిక సంఘాల పోరాటాలు సత్ఫలితాలు ఇస్తాయా
- పూసపల్లి ఓసిని ప్రారంభించాలని కార్మికులు వేడుకోలు
- డిప్యూటేషన్ కార్మికులు ఇక్కడికే వచ్చేలా చొరవ చూపాలంటున్న కార్మికులు
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!

సింగరేణి ఇల్లందులో పుట్టి 11 ఏరియాలలో వ్యాపించి, ప్రస్తుతానికి సుమారుగా 40 వేలకు పైగా కార్మికులు, సుమారుగా 30 వేలకు పైగా కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించడం జరుగుతుంది. అధికారుల అలసత్వం.. కొన్ని కార్మిక సంఘాల నిర్లక్ష్యం వల్ల నేడు ఇల్లందు ఏరియా కనుమరుగయి, చరిత్ర పుటల్లోకి వెళ్లే పరిస్థితి నెలకొంది.

● ఇల్లందు, ప్రజాజ్యోతి



# జాతీయ పంచాయతీ అవార్డుల పోటీలో సీతంపేట గ్రామం ఎంపిక

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** జాతీయ పంచాయతీ అవార్డులు 2023–24లో భాగంగా పచ్చదనం–పరిశుభ్రత విభాగంలో సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామం ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని అభినందనీయం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాల్లో సాధించిన పురోగతికి గుర్తింపుగా ఈ ఎంపిక జరిగిందన్నారు, ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ సీతంపేట గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య చర్యలను సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీలు, ఇంకుడు గుంతలు, ఇంటింటి మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయ సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిలో నిర్మించిన మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించుకోవాలని, బహిరంగ విసర్జనకు చేయరాదు అని గ్రామస్థులకు సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి

మిగతా 2 లో...

# ఇల్లందులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఇరువురు మృతి
- మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు

**ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** మండలంలోని సుదిమళ్ల స్టేజీ మెయిన్ రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొల్లాపురం

మిగతా 2 లో...





# పాల్వంచలో ఇసుక మాఫియా అరాచకం

- నిద్రలేని రాత్రులు గడుపుతున్న నాగారం గ్రామస్థులు
- ఫిర్యాదులు అందుతున్న పట్టించుకోని అధికారులు
- అక్రమ ఇసుక తరలింపులో మొద్దు నిద్ర వీడని అధికారులు
- ఇసుక తోడేళ్లను తాట తీసేది ఎవరు

**పాల్వంచ, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ముఖ్యంగా పాల్వంచ మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీ పరిధిలో గల మొర్రేడు వాగు

మిగతా 2 లో...



## ఇల్లందులో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి...)



గ్రామానికి చెందిన పాయం సురేష్, పాయం ధనలక్ష్మి , పాయం సాకేత్, పాయం జయశ్రీ లు రెండు ద్విచక్ర వాహనాలపై ఓ వివాహ వేడుకకు వెళ్తున్నారు. సుదిమళ్ల స్టేజ్ దాటాక మెయిన్ రోడ్డుపై వారు ప్రయాణిస్తున్నరెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొని కింద పడడం జరిగింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ కిందపడి ఉన్న పాయం ధనలక్ష్మి (45), పాయం జయశ్రీ (18) లపై నుంచి వెళ్లడంతో ఇరువురు నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందారు. పాయం సురేష్, పాయం సాకేత్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి. పాయం సాకేత్ 2 కాళ్ళు నుజ్జు నుజ్జు కాగా, పాయం సురేష్ కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. కొత్తగూడెం వెళ్తున్న ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ ఘటనా స్థలంలో ఆగి 108 ద్వారా క్షతగాత్రులను ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ పంచాయతీ అవార్డుల పోటీలో సీతంపేట గ్రామం ఎంపిక





(మొదటి పేజీ తరువాయి...)

గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, చెత్త వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీలు ఎక్కడా మూసుకుపోకుండా తరచుగా శుభ్రపరచాలని, ఇంకుడు గుంతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పురుషులు, మహిళలకు వేర్వేరు మరుగుదొడ్ల ఏర్పాటు చేసి పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పచ్చదనం విస్తరించేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు పెంచి ప్రతి వీధిలో, ఖాళీ ప్రదేశాలలో, పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాల పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో సీతంపేట గ్రామం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ లైబ్రరీలో 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన అధ్యయన సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీల వెంట ఉన్న గుంటలను సరిచేయడానికి అవసరమైన రోలర్ ను అందజేస్తామని హామీ ఇచ్చారు. బయోచార్ తయారీ చేసి వచ్చిన బొగ్గుని డ్రైనేజీలలో చల్లడం ద్వారా డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంటాయి అని ఆ విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్వరలో జాతీయ స్థాయి పరిశీలన బృందం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పరిరక్షణ, మౌలిక సదుపాయాల సంరక్షణలో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, శిక్షణ డి పి ఓ అనూష, ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ శ్రీనివాస్, డీఎల్పీఓ ప్రభాకర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో ఇసుక మాఫియా అరాచకం

(మొదటి పేజీ తరువాయి...)

ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా యథేచ్ఛగా రాత్రింబవళ్లు లారీలతో ఇసుకను తరలిస్తున్నారు.

**అర్ధరాత్రుల్లు ఆగని దందా..**

పగలు నిశ్శబ్దంగా ఉండే ఈ ప్రాంతం, చీకటి పడగానే లారీల మోతతో దద్దరిల్లుతోంది. మొర్రేడు వాగు నుండి అర్ధరాత్రి వేళల్లో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి, ట్రాక్టర్లు, లారీల ద్వారా రహస్యంగా తరలిస్తున్నారు. నాగారం గ్రామ శివార్లలో విచ్చలవిడిగా సాగుతున్న ఈ తోలకాల వల్ల అటు పర్యావరణం దెబ్బతినడమే కాకుండా, గ్రామ రహదారులు కూడా ధ్వంసమవుతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు..**

ఈ అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖ అధికారు



లకు పలుమార్లు విన్నవించినా, వారు కనీసం అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కలెక్టర్ స్పందించాలి: సర్పంచ్ స్వప్న**

నాగారం గ్రామ పరిధిలో జరుగుతున్న ఈ అక్రమ తవ్వకాలను తక్షణమే అరికట్టాలని గ్రామ సర్పంచ్ స్వప్న డిమాండ్ చేశారు. "మా గ్రామ సంపదను అక్రమంగా దోచుకుంటున్నారని రాత్రిపూట లారీల శబ్దాలతో ప్రజల కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని అన్నారు, జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని, మొర్రేడు వాగును కాపాడాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని" ఆమె కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దు నిద్రను వీడి నాగారం గ్రామ శివారులో గల ముర్రేడు వాగు లో జరుగుతున్న అక్రమ ఇసుక తరలింపు, తవ్వకాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## బ్రెజిల్ దేశంలో లిథియం మైనింగ్ లో భాగస్వామ్యానికి సింగరేణికి ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి...)

అల్వారేంగా తమ కంపెనీ వివరాలను తెలియజేశారు. బ్రెజిల్ దేశంలో ఇప్పటికే తాము లిథియం మైనింగ్ చేపట్టామని, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల పట్ల ఆసక్తితో ఉన్న నేపథ్యంలో తమ కంపెనీలో భాగస్వామిగా చేరినట్లయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు వివరించారు. తాము సింగరేణి తో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీలను కూడా సంప్రదిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేడు ప్రపంచంలో లిథియం కీలక ఖనిజానికి ఉన్న ప్రాధాన్యత, వ్యాపార కోణంలో ఉన్న లాభదాయకత గురించి వివరించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన వివరాలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ గౌతమ్ పోట్రు వివరించారు. బ్రెజిల్ దేశంలో కీలక ఖనిజ అవకాశాలను,




లాభదాయకత తదితర అంశాలను తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

# పసిపాప ప్రాణం తీసిన కుల అహంకారం

- ఆళ్ళపల్లి లో మిన్నంటిన నిరసన
- నాగర్ కర్నూల్ ఘటనపై రజక సంఘం ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ..
- మద్దతు తెలిపిన అన్ని కులాలు.

**ఆళ్లపల్లి,ఫిబ్రవరి25.ప్రజా జ్యోతి** నాగర్ కర్నూల్ జిల్లా ఉమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా జరిగిన అమానుష ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఆగ్రహం వెల్లువెత్తింది. రజక కులానికి చెందిన చిన్నారి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రజక సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య మాట్లాడుతూ ఘటన వివరాలను వెల్లడించారు. ఉమ్మెర జాతరలో రజక కుటుంబానికి చెందిన గణేష్, మౌనికలను టికెట్ విషయంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరు దూషించి దాడికి పాల్పడ్డారు. "మమ్మల్ని కొట్టకండి" అని వేడుకుంటూ తమ రెండు నెలల పాపను యజమాని పాదాల వద్ద ఉంచినా.. కనికరం లేకుండా ఆ చిన్నారిని కాలితో





విసిరికొట్టడం అత్యంత దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం సమాజానికే సిగ్గుచేటని మండిపడ్డారు. లోకాన్ని చూడాల్సిన పసిపాప తక్కువ కులంలో పుట్టడమే నేరమా? ఈ కుల అహంకారానికి అంతం ఎప్పుడు? ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కొత్త చట్టాలు తెచ్చి నిందితులను కఠినంగా శిక్షించాలి." – రేసు ఎల్లయ్య అన్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఆళ్లపల్లి బస్టాండ్ సెంటర్ నుండి భగత్ సింగ్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నేతలు ముప్పారపు రాము, ముప్పారపు రాకేష్, బూరగడ్డ నాగేష్, సతీష్, కృష్ణ, వెంకటేష్, శ్రీకాంత్, నవీన్, సమ్మయ్య, రాములు, బూరుగడ్డ రాజు, గడ్డం కృష్ణ. విశ్వకర్మ సంఘం గుంతోజు శ్రీను. యాదవ సంఘం: కసనబోయిన నరేష్. గౌడ సంఘం: గుండెబోయిన రామకృష్ణ. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

## విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

**పాల్వంచ, ఫిబ్రవరి 25, ప్రజా జ్యోతి** ములకలపల్లి మండలం మూక మామిడి గ్రామంలో బుధవారం విద్యుదాగాదంతో వలస ఆదివాసి కూలి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది , ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, చత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన మడివి ముద్రం (35) పొట్ట కోటి కోసం ములకలపల్లి గ్రామానికి వచ్చి నరికివేత పనుల్లో కూలి పనిచేస్తున్నాడు, పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు 220/ 11 కెవి విద్యుత్ తీగల తగలడంతో మడివి ముద్రం అక్కడికక్కడే మృతి చెందాడు, అక్కడే ఉన్న తోటి కార్మికులు మృతదేహాన్ని పాల్వంచలోని ప్రభుత్వ ఆసుపత్రికి ట్రాక్టర్ ద్వారా తరలించారు. చేతికి అందిన కొడుకు కళ్ళముందే విగత జీవిగా మారడంతో మృతుని తల్లిదండ్రులు, బంధువులు, తోటి కార్మికుల రోదనలు మిన్నంటాయి, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- **అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**





**పాల్వంచ ,ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి** జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు . పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల, పాల్వంచ లోని పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును సమగ్రంగా పరిశీలించారు. ప్రశ్నాపత్రాల భద్రతా పంపిణీ విధానం, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, ఇన్విజిలేషన్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించి, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు, జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. జనరల్, వొకేషనల్ విభాగాలు కలిపి మొత్తం 9,685 విద్యార్థులు ఉండగా , అందులో 9,210 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 7,973 మందికి విద్యార్థులు ఉండగా , 7,683 మంది హాజరయ్యారని, వొకేషనల్ విభాగంలో 1,712 మంది ఉండగా, 1,527 మంది హాజరయ్యారని, మొత్తం 475 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.పరీక్షల సందర్భంగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాలలో తాగు నీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అన్ని మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించినట్లు తెలిపారు .ఇంటర్ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు ఇదే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సువర్చల సహితా అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



**ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:**సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని శ్రీ సువర్చల సహితా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్టను బుధవారం ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇల్లందు ఏరియా జీఎం వి. కృష్ణయ్య దంపతులు, ఎస్ఓటూ జియం డి. రామస్వామి దంపతులు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి దంపతులు, కమిటీ సభ్యుల దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం హోమ కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, శివలింగ ప్రతిష్ట, లక్ష్మీదేవి, గణపతి ప్రతిష్ట, నాగపంచమి ప్రతిష్ట, ప్రతిష్టలతో పాటు ఇతర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం శివకళ్యాణ మహోత్సవంలో దంపతులు పాల్గొని కళ్యాణాన్ని జరిపించారు. అదేవిదంగా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన మహా ప్రసాదంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి దర్శనంతో పాటు ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## సులానగర్ జడ్పీహెచ్ఎస్ లో మధ్యాహ్న భోజనం పరిశీలన



**టేకులపల్లి, ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం సులానగర్ గ్రామ పంచాయతీలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సర్పంచ్ గుగులోత్ లక్ష్మ నాయక్,ఉప సర్పంచ్ ఉండేటి చెన్నయ్య బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఈ సందర్భంగా వారు ఆదేశించారు.అదేవిధంగా విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



**టేకులపల్లి,ఫిబ్రవరి26,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు కార్యక్రమంలో భాగంగా బుధవారం నుండి జరుగునున్న ఇంటర్మీడియట్ పరీక్షలు టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగింది. మొదటి రోజు ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయడానికి విద్యార్థులు మొత్తం 168 మంది కాగా 164 మంది విద్యార్థులు ఈ పరీక్ష కు హాజరయ్యారు.పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**టేకులపల్లి,ఫిబ్రవరి 26, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం లోని గంగారం సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు చనిపోయిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది.వివరాల్లో కెళ్తే టేకులపల్లి మండలం లోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కోర్స రాంబాబు (30) లచ్చగూడెం నుంచి బైకుపై ఆళ్లపల్లి వెళుతుండగా... గంగారం సమీపంలో ఎదురుగా వస్తున్న ఐస్ క్రీమ్ బండి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి.బుధవారం కోర్స రాంబాబు కొత్తగూడెం ఏరియా ప్రభుత్వం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బోడు పోలీసులు సంఘటనానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య కళ్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



**బూర్గంపహాడ్,ఫిబ్రవరి25 (ప్రజా జ్యోతి ):**బూర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణ సాగర్ గ్రామ పంచాయతీలోని ఎస్టీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేశారు.అదేవిధంగా విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యులు గుండి వెంకటేశ్వర్లు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఓవర్ మెన్ దుర్భాషలాడిన కెఓసి, పిఓ

- **పిఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన కార్మికులు**





**టేకులపల్లి,ఫిబ్రవరి26,ప్రజాజ్యోతి:**ఇల్లందు ఏరియా టేకులపల్లి మండల కోయగూడెం ఓసి ప్రాజెక్టు అధికారి వ్యవహార శైలి రోజురోజుకు వివాదాస్పదంగా మారుతుంది.ఒక వైపు గనిలో బొగ్గు ఉత్పత్తి,రవాణాపై దృష్టిసారించకపోగా మరోవైపు నిర్వాసితుల పట్ల చులకనగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తుంది. కోయగూడెం ఓసి లో వే బ్రిడ్జ్ లో తలచిన సాంకేతిక సమస్యను సకాలంలో గుర్తించని నిర్లక్ష్యం కారణంగా సింగరేణి వేలాది టన్నుల బొగ్గును నష్టపోయిన విషయం బహిర్గతం కావడం వల్ల పిఓ ఎవరి మీద ఫ్రెస్టేషన్ చూపించలేక తన కింది అధికారుల మీద చూపిస్తున్నాడని ఏకంగా పిఓ ఆఫీస్ ముందు సింగరేణి ఉద్యోగులు ధర్నాకు దిగడం జరిగింది. ఇటీవల కోయగూడెం ఓసి నిర్వాసిత టార్పాలిన్ కార్మికుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేయడంతో విషయం ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టి వరకు వెళ్లింది.ఇది ఇలా ఉండగా తాజా గా మూడు రోజుల క్రితం విధుల్లో ఉన్న ఓవర్ మెన్ పట్ల అసభ్యకరంగా దూషించడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలోనే మంగళవారం కేఓసీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కార్మికులు సుమారు గంటకు పైగా ఆందోళన నిర్వహించారు.ప్రాజెక్టు అధికారి క్షమాపణ చెప్పాలంటూ ఆందోళన దిగారు.ఆ రోజు ప్రాజెక్ట్ అధికారి లేకపోవడంతో తిరిగి బుధవారం కార్మిక సంఘాల నాయకులు ఓవర్ మెన్ దూషించిన విషయమై చర్చలు జరిపినట్లు తెలిసింది. బొగ్గు ఉత్పత్తి,రవాణాలో విఫలం కావడంతో పాటుగా వే బ్రిడ్జిలు తలెత్తిన సాంకేతిక తప్పిదాన్ని సకాలంలో గుర్తించడం లో నిర్లక్ష్యం వహించడంతో పాటుగా విధుల్లో ఉన్న కార్మికుల పట్ల,నిర్వాసిత ఆదివాసీల పట్ల కెఓసి,పిఓ అనుసరిస్తున్న వైఖరిపై సర్వాత్ర విమర్శలు వెలుగుతున్నాయి . సింగరేణి సిఎండి కోయగూడెం ప్రాజెక్టు అధికారి పై చర్యలు తీసుకోవాలని కార్మికులు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## మావోయిస్టుల స్మారక చిహ్నం కూల్చివేత




**చర్ల, ఫిబ్రవరి 25: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో నిర్వహిస్తున్న నక్సల్ నిర్మూలన ప్రచారంలో భాగంగా మంగళవారం చింతగుఫా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని పోటేబాంగ్ గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు ఒక నక్సల్ స్మారక చిహ్నాన్ని కూల్చివేశాయి. సీనియర్ అధికారుల దిశ మార్గదర్శకత్వంలో సి ఆర్ పీ ఎఫ్ 02 బెటాలియన్ జిల్లా పోలీసు దళం సంయుక్త బృందం ఆ ప్రాంతంలో శోధన ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నిర్మించిన నక్సల్ స్మారక చిహ్నాన్ని భద్రతా దళాలు చూశాయి. భద్రతా కారణాల దృష్ట్యా, మొత్తం ప్రాంతాన్ని సైనికులు క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆ ప్రాంతం పూర్తిగా సురక్షితంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత, నిబంధనల ప్రకారం నక్సలైట్ స్మారక చిహ్నాన్ని కూల్చివేశారు. ఆపరేషన్ సమయంలో, బాహ్య కార్డన్ కట్–ఆఫ్ విధులను కూడా సమర్థవంతంగా సమన్వయంతో నిర్వహించారు. ఆపరేషన్ తర్వాత అన్ని దళాలు తమ శిబిరాలకు సురక్షితంగా తిరిగి వచ్చాయి. సుక్మా జిల్లా పోలీసులు నక్సలైట్ నిర్మూలన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు అని ఈ ప్రాంతంలో శాంతి భద్రత అభివృద్ధికై సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నారు అని అధికారులు అన్నారు .

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి25 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కాగా ఈ పరీక్షలకు 239 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా తొలిరోజే ముగ్గురు విద్యార్థులు గైరాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిన్యా తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎస్ఐ మేడా ప్రసాద్ పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ రామా నాయక్





**టేకులపల్లి, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం చుక్కలబోడు గ్రా మపంచాయతీ సర్పంచ్ బి.రామా నాయక్ సరిత దంపతులు సర్పంచ్ ఎన్నికలలో గ్రామపంచాయతీ ఓటర్లకు ఇచ్చిన హామీ ప్రకారం గ్రామంలో వివాహం చేసుకునే ప్రతి ఆడబిడ్డకు బీరువాని బహుమానంగా అందజేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుకునే ప్రయత్నంలో భాగంగా చుక్కలబోడు గ్రామానికి చెందిన మాలోత్ కిషన్ జ్యోతి దంపతుల కుమార్తె మౌనిక సందీప్ వివాహ వేడుక హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి బీరువాను బహుమానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చందర్,రాందాస్, వీరన్న, కిషన్, వినోద్, రమేష్, కాలో, చిట్టిబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## చిన్న చినుకుపడితే బురదే...

# కొత్తతండా (పి )గ్రామస్తుల ఇబ్బందులు





**టేకులపల్లి,ఫిబ్రవరి26, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని కొత్తతండా (పీ) తావర్యా తండా వైపు వెళ్లే రోడ్డుపై వర్షం నీరు ఆగి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రహదారి గుంతలమయం అవుతున్నట్లు తెలిపారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా అధికారులు రహదారి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే గ్రామ పంచాయతీలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

### సులానగర్ లో మల్టీపర్పస్ వర్క్స నిర్లక్ష్యం

సులానగర్ పంచాయతీలో పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డ్ లో వేయకుండా రోడ్డు పక్కనే తగలబెడుతుండడంతో కరెంట్ వైర్లకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. రోడు పొగ తో కప్పేసి గంటసేపు ప్రధాన రహదారిపై నడిచే వాహనాలకు ఇబ్బంది కలిగించారని గ్రామస్తులు ఆరోపించారు. ఇలా చేస్తే ప్రమాదం జరగడం తథ్యమని గ్రామస్తులు అంటున్నారు. సులానగర్ సెక్రటరీ, మల్టీ పర్పస్ వర్కర్స్ నిర్లక్ష్యం వీడి శుభ్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రభుత్వం ఆరుగ్యారెంటీలను తక్షణమే అమలుచేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నర్సారెడ్డి డిమాండ్



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి ):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చాక ఆ హామీలను మరిచిందని తక్షణమే ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సారపాక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఇచ్చే రూ.2500 ఎటు పోయాయని, ఉపాధి కార్మికులకు ఇస్తానన్న రూ.12వేలు హామీ ఏమైందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి అర్హులకు ఇవ్వడంలేదని, ఆటోకార్మికులకు ఇచ్చే రూ.15వేలు ఏమయ్యాయని మండిపడ్డారు. ఖమ్మం ప్రాంతంలో ఇళ్లు కట్టుకుని 15 ఏళ్లుగా నివాసముంటున్న నిరుపేద కుటుంబాలపై ముందస్తు నోటీసులు లేకుండానే కూల్చివేసే చర్యలకు పాల్పడిందని, ఖాకీలచే ప్రభుత్వం ఈ దౌర్జన్యం చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే ప్రజలకు ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలుచేయాలని లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజిని, పాండవుల రామనాథం, ఎస్కో. అబిదా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు

**ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇల్లందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, సాహితీ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాలలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీరు, మరుగుదొడ్లు, మెడికల్ సౌకర్యాలను సమకూర్చారు. నాలుగు పరీక్ష కేంద్రాలలో 46 మంది సిబ్బందిని నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇల్లందు పోలీసులు సిబ్బందిని నియమించారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం







**చర్ల, ఫిబ్రవరి 25: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల బుదవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది, విద్యార్థులు నిర్ణీత సమయానికే పరీక్షా హాల్ కి చేరుకున్నారు ఎటువంటి మాల్ ప్రాక్టీస్, జరగలేదని చీఫ్ సూపర్డెంట్ నరేందర్ తెలియజేశారు, జనరల్ గ్రూపు నందు 88 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైహాజర్ అవగా 81 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు, ఇక ఒకేషనల్ గ్రూప్ నుంచి మొత్తం 120 మంది విద్యార్థులకు గాను 113 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు ఏడుగురు గైహాజర్ అయ్యారు. మొత్తం 208 మంది విద్యార్థులకు గాను 194 మంది పరీక్షకు హాజరైనారు . మొత్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 14 మంది గైహాజర్ అని తెలియజేశారు, ప్రతి విద్యార్థి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా తగు ఏర్పాట్లను చేసినట్లు చీఫ్ సూపరిన్ టెండెంట్ నరేందర్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 16వ తారీకు వరకూ పరీక్షలు జరుగుతాయని, ప్రధమ , ద్వితీయ సంవత్సరం జనరల్ ఒకేషనల్ విభాగం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలియజేశారు.

# అసత్యాల అగ్ని రాజేస్తే రాజకీయ భూకంపం తప్పదు

- మంత్రి తుమ్మలపై దుష్ప్రచారాలకు కాసాని నాగప్రసాద్ గర్జన

**దమ్మపేట,ఫిబ్రవరి. 25, (ప్రజాజ్యోతి):** మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావుపై ఉద్దేశపూర్వకంగా సాగుతున్న అసత్య ప్రచారాలపై జిల్లా కాంగ్రెస్ నాయకుడు కాసాని నాగప్రసాద్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, సోషల్ మీడియాను వేదికగా చేసుకుని దరు జర్నలిస్టులు మంత్రి ప్రతిష్టను దెబ్బతీయడానికి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు.ముఖ్యంగా తొలివెలుగు రఘు,దాసరి శ్రీనివాస్ పేర్లు ప్రస్తావిస్తూ, వారు చేస్తున్నవి జర్నలిజం కాదని, అది స్పష్టమైన "బ్లాక్‌మెయిల్ రాజకీయాలు" అని ఆరోపించారు. 40 ఏళ్ల ప్రజా జీవితం మొత్తం అభివృద్ధికే అంకితం చేసిన తుమ్మల నాగేశ్వరరావుపై బురద చల్లడం సూర్యునిపై ఉమ్మేయ్యడమేనని తీవ్రంగా వ్యాఖ్యానించారు.వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారంలో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆ భూములు కోర్టు పరిధిలో ఉన్నాయని, కోర్టు ఆదేశాలు,భూదాన్ బోర్డు



ఫిర్యాదు మేరకు అధికారులు చట్టబద్ధంగా చర్యలు తీసుకున్నారని వివరించారు. గతంలో పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో వందలాది ఇళ్లను కూల్చివేసిన సంఘటనలు జరిగాయని గుర్తు చేస్తూ, తుమ్మలకు అలాంటి చరిత్ర లేదన్నారు.కొంతమంది నాయకుల నుంచి లక్షల రూపాయల పారితోషికం తీసుకుని పేదలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని నాగప్రసాద్ సంచలన ఆరోపణలు చేశారు. వార్తల పేరుతో అర్ధసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలనే



ప్రయత్నాలు చేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు.గతంలో వీరు ఎదుర్కొన్న కేసులు, చేసిన తప్పులు ప్రజలకు తెలుసని, అలాంటి వ్యక్తులు నీతులు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఇకనైనా తీరుమార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని కాసాని నాగప్రసాద్ కఠిన హెచ్చరిక జారీ చేశారు.

## మొండికుంట చెరువును పరిశీలించిన రెవెన్యూ అధికారులు



**టేకులపల్లి,ఫిబ్రవరి26,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం కొత్తతండా(జి) గ్రామపంచాయతీ పరిధిలోని మొండికుంట చెరువు ఆక్రమణకు గురైనట్లు పలుమార్లు చెరువు పరిసర ప్రాంత రైతులు టేకులపల్లి తహసిల్దార్ కు ఫిర్యాదు చేయగా బుధవారం రెవిన్యూ అధికారులు ఆర్ఐ సౌజన్య వారి సిబ్బందితో కలిసి మొండికుంట చెరువును పరిశీలించి రైతులతో మాట్లాడారు త్వరితగతిన విచారణ చేపట్టి మాకు న్యాయం చేయగలరని రైతులు వాబోతున్నారు.

# చంద్రబాబుపై బురదజల్లితే ప్రజల మధ్యే నిలదీస్తాం

- అశ్వరావుపేట నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ కట్రం స్వామి దొర

**దమ్మపేట, ఫిబ్రవరి. 25, (ప్రజాజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు పై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అసత్య ప్రచారాలపై అశ్వరావుపేట టీడీపీ ఇంచార్జ్ కట్రం స్వామి దొర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలుగుమట్ల భూదాన్ భూముల అంశాన్ని వక్రీకరిస్తూ ఉద్దేశపూర్వకంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు.
నారా చంద్రబాబు నాయుడు పై సోషల్ మీడియా ముసుగులో



కొందరు కిరాయి జర్నలిస్టులు చేస్తున్న అసత్య ప్రచారాలను అశ్వరావుపేట టీడీపీ ఇంచార్జ్ కట్రం స్వామి దొర తీవ్రంగా ఖండించారు.ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల అంశాన్ని అడ్డం పెట్టుకుని ఏపీ ముఖ్యమంత్రి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న తొలివెలుగు రఘు పై ఆయన నిప్పులు చెరిగారు. "వీరి బ్రతుకులు బ్లాక్‌మెయిల్ బ్రతుకులు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కొందరు రాజకీయ నాయకుల కనుసన్నల్లో నడుస్తూ, పారితోషికాల కోసం వార్తల పేరుతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.
వెలుగుమట్ల ప్రాంతంలో పేదలను రెచ్చగొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలకు వీరికి పేదలపై ప్రేమ కాదని, కేవలం డబ్బుపైనే ఆశ ఉందని మండిపడ్డారు. వెలుగుమట్ల భూముల వ్యవహారానికి నారా చంద్రబాబు నాయుడుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కోర్టు తీర్పు,భూదాన్ బోర్డు ఫిర్యాదు మేరకే అధికారులు చర్యలు చేపట్టారని వివరించారు. ఏ చిన్న అవినీతి మచ్చ లేని నాయకుడైన చంద్రబాబుపై బురద అంటించాలని చూడటం సూర్యునిపై ఉమ్మేయ్యడమేనని ఎద్దేవా చేశారు. గతంలో రఘును ఒక సంస్థ నుండి ఎందుకు వెళ్లగొట్టారో ఖమ్మం ప్రజలకు తెలుసని గుర్తు చేస్తూ, అటువంటి వ్యక్తులు మీడియా ముసుగులో వేషాలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో అశ్వరావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల అధ్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు, ఎండి వలీ పాషా, తేళ్ల చెన్నయ్య, పానుగంటి రామారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై దుష్ప్రచారం అంగీకారయోగ్యం కాదు

### –మాజీ జడ్పీటీసీ పైడి

**దమ్మపేట, ఫిబ్రవరి. 25, (ప్రజాజ్యోతి):** వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర రావును లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఆరోపణలను మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ప్రజా జీవితంలో నిష్పక్షపాత ధోరణితో ముందుకు సాగుతున్న నాయకుడి ప్రతిష్టను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల అంశాన్ని వక్రీకరిస్తూ అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ, ముఖ్యంగా తొలివెలుగు రఘు,దాసరి శ్రీనివాస్ పేర్లు ప్రస్తావించారు. వార్తల పేరుతో ఆధారరహిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు మానుకోవాలని సూచించారు.వెలుగుమట్ల భూముల వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని, భూదాన్ బోర్డు ఫిర్యాదు–న్యాయస్థాన ఆదేశాల మేరకే సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారని స్పష్టం చేశారు. ఆ అంశానికి మంత్రికి ఎటువంటి సంబంధం లేదని ఆయన వివరించారు.ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని, అయితే అవి వాస్తవాలపై ఆధారపడి ఉండాలని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు సమాజానికి మేలు చేయవని, బాధ్యతాయుతమైన వ్యవహారం అవసరమని సూచించారు.ఇకపై ఇలాంటి ప్రచారాలు కొనసాగితే చట్టపరమైన మార్గాల్లో స్పందించాల్సి వస్తుందని పైడి వెంకటేశ్వరరావు తెలిపారు.



## గుడిపాడు గ్రామంలో దేవతామూర్తుల

- విగ్రహాల ప్రతిష్టకు ఘనంగా ప్రత్యేక పూజలు
- గోవిందా నామస్మరణతో మారుమోగుతున్న పాల్వంచ పట్టణం

**పాల్వంచ, ఫిబ్రవరి 25 ,ప్రజా జ్యోతి** పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు గ్రామంలో గల శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో ఈనెల 26 గురువారం జరిగే వివిధ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు , శిధిలావస్థకు చేరిన శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరిగి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లారి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి వారి దివ్య ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి విగ్రహముల ధాన్యాదివాసము పూజా మహో



త్సవ కార్యక్రమం లో కుటుంబ సమేతంగా సురేష్‌రేడ్డి ప్రవళిక దంపతులతో పాటు ,ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రతిష్ట విగ్రహాలకు వరి ధాన్యం సమర్పించి స్వామి వారి ఆశీస్సులు తీసుకొని తీర్థ ప్రసాదాల స్వీకరించారు, నేడు నిర్వహించనున్న విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు



ఉమ్మడి జిల్లాల నుండే కాకుండా, వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని నేడు ఆలయంలో ప్రతిష్టించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు, దీంతో పాల్వంచ పట్టణం గోవింద నామస్మరణతో మారుమోగింది

- అధికారుల సమన్వయ లోపమే... ఇల్లందు ఏరియాకు శాపమా?
- గత అధికారులు ఏరియా మనుగడ కోసం ఆరాటం!
- భారీగానే కార్మికులు డిప్యూటేషన్ పై బదిలీలు
- డిప్యూటేషన్ పై బదిలీలలో పాటించని నియమనిబంధనలు?
- పూసపల్లి ఓసి ప్రారంభానికి మోక్షమేప్పడో!
- కొన్ని కార్మిక సంఘాల పోరాటాలు సత్ఫలితాలు ఇస్తాయా
- పూసపల్లి ఓసిని ప్రారంభించాలని కార్మికులు వేడుకోలు
- డిప్యూటేషన్ కార్మికులు ఇక్కడికే వచ్చేలా చొరవ చూపాలంటున్న కార్మికులు
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!




# ఇల్లందు కనుమరుగుకు బాధ్యులేవరూ!

**సింగరేణి ఇల్లందులో పుట్టి 11 ఏరియాలలో వ్యాపించి, ప్రస్తుతానికి సుమారుగా 40 వేలకు పైగా కార్మికులు, సుమారుగా 30 వేలకు పైగా కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించడం జరుగుతుంది. అధికారుల అలసత్వం.. కొన్ని కార్మిక సంఘాల నిర్లక్ష్యం వల్ల నేడు ఇల్లందు ఏరియా కనుమరుగయి, చరిత్ర పుటల్లోకి వెళ్లే పరిస్థితి నెలకొంది.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

సుమారుగా 130 ఏళ్లకు పైగా చరిత్ర ఇల్లందుకు ఉంది. 1886కు ముందు భద్రాచలం వెళ్తూ వంట చేసే క్రమంలో భూమిలో నుంచి మంటలు రావడంతో ఆ విషయాన్ని బ్రిటిష్ వారికి వారికి చెప్పడంతో ప్రతినిధులను పంపి సర్వే చేయగా భారీగా బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు జియో లాజిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి డాక్టర్ విలియం కింగ్ కనుగోన్నారు. అప్పుడు హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్ ను ఏర్పాటు చేసి బొగ్గు త్రవ్వకాలను ప్రారంభించారు. కాలక్రమేణా దక్కన్ కంపెనీ పేరును సింగరేణి కంపెనీ లిమిటెడ్ గా మార్చి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో సర్వే నిర్వహించి బొగ్గు నిక్షేపాలను కనుగొనడం జరిగింది. ఇల్లందు ఏరియాలో స్టట్ ఫిట్ జెకె 1,2,3,4,5, 29 డిప్ గనులతో పాట మరికొన్ని గనులను ఒక్కొక్కటిగా మూసివేస్తూ ఓసి 1.2 లను ఏర్పాటు చేసి కొంతకాలంలోనే ఓసి 2ను సైతం మూసివేయడం జరిగింది. ఇల్లందులో అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ అండర్ గ్రౌండ్ బావులకు బదులుగా ఓసీలను ఏర్పాటు చేసి బొగ్గు నిక్షేపాలను అతి తొందరగా తరలిస్తూ కనుమరుగు అయ్యేందుకు కుట్రలు జరిపారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఓసీలలో 100 నుండి 120 మీటర్ల లోతు వరకు బొగ్గు వెలికి తీసి అవకాశం ఉంటుంది. అంటే సుమారుగా 1600 మీటర్ల లోతున ఉన్న బొగ్గులో కేవలం 10 శాతమే తీస్తుండగా మిగిలిన 90 శాతం బొగ్గు భూమిలోనే సమాధి చేస్తున్నారు. గతంలో సుమారుగా 10 వేలకు పైగా కార్మికులతో కళకళలాడిన ఇల్లందు ఏరియా నేడు సుమారుగా 400లకు పైగా కార్మికుల ఉండగా వారిలో సుమారుగా 120 మందికి పైగా కార్మికులను ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేయడం జరిగింది. గత కొన్నేళ్ల క్రితం జెకె5 ఓసి కాలం పూర్తి అవడంతో యాజమాన్యం ప్రత్యామ్నాయంగా జెకె5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి ఓసి) కు ప్రస్తావన తెరమీదకు రావడం జరిగింది. జెకె5 ఓసిలో బొగ్గు ఉత్పత్తి పూర్తికాక ముందే నూతన పొడగింపు ప్రాజెక్టు అప్పటి అధికారులు వేగవంతం చేసినప్పటికీ ప్రస్తుత అధికారుల వల్ల ఆ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదనే అపవాదు లేకపోలేదు. పైగా జెకె 5ఓసి పొడిగింపు ప్రాజెక్టుకు అనుమతులన్నీ వచ్చాయని సెప్టెంబర్ లో పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పినప్పటికీ నేటికి ఆ పనులు ప్రారంభం కావడానికి మరికొన్ని అనుమతులు రావాల్సి ఉన్నాయని అధికారులు చెప్పడం కోసమెరుపు. గతంలో సెప్టెంబర్ నెలలో నూతన ఓసి పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పిన కానీ నూతనంగా మరికొన్ని అనుమతులను బూచిగా చూపెడుతున్నారని, అధి కారుల మాటలు నీటి మీద రాతలేనా అని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

గత కొన్ని నెలల నుంచి జెకె5 ఓసిలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా బంద్ అయింది. ఇక్కడ పని చేసే కార్మికులతో పాటు సిహెచ్పిని సైతం పూర్తిగా బంద్ చేసి అక్కడ పనిచేసే కార్మికులను ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేశారు. వర్క్ షాప్ లతో పలు విభాగాల్లో కార్మికులను కూడా తగ్గించుకుంటూ వస్తున్నట్లు సమాచారం.

ఇక ఇల్లందు ఏరియాకు తలమానికంగా ఉన్న కోయగూడెం ఓసిలో కూడా బొగ్గు అంతంతమాత్రంగానే ఉత్పత్తి అవుతుందని, ప్రధానంగా బొగ్గు గ్రేడింగ్ వల్ల మార్కెట్ లో కొంత ఇబ్బంది కలుగుతున్న మాట వాస్తవమేనని అధికారులు కోరుకుంటున్నారు. ఇల్లందు ఏరియాలో జి13, జి14 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతుందని, అందులో నుంచి సేల్ బొగ్గును వేరుచేయగా చాలా వరకు వెస్ట్ బొగ్గు మినహా జి14 బొగ్గు చాలా తక్కువ వస్తుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా గత రెండేళ్ల క్రితమే కెఓసి పిట్ 3 పనులు ప్రైవేట్ సంస్థకు కేటాయించగా అప్పట్లో పలు కార్మిక సంఘాలు ఆందోళనల వల్ల పనులు ప్రారంభం కాలేదు. అయితే కెఓసి పిట్ 3ని సింగరేణి సంస్థ ద్వారానే ఓబీ, బొగ్గును తీయాలని డిమాండ్ చేసినప్పటికీ అటు ప్రైవేట్ సంస్థ, ఇటు సింగరేణి సంస్థ ద్వారా నేటికి పనులు ప్రారంభం కాక తీవ్ర జాప్యం జరుగుతుందని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా ఇల్లందు ఏరియా కనుమరుగు అవ్వడానికి బాధ్యులేవరోనని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లనే ఇల్లందు ఏరియాకు శాపంగా మారిందని ఇల్లందులో జోరుగా చర్చ జరుగుతుంది. గతంలో ఇల్లందు ఏరియాలో పనిచేసిన అధికారులందరూ సమన్వయంతో పనిచేయడం వల్లనే నూతన ఓసి కోసం నిరంతరం కృషి చేయడం జరిగిందని, ప్రస్తుత అధికారుల్లో ఆ తాపత్రయం, ఆరాటం ఎక్కడా కనిపించడం లేదని కార్మికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇల్లందు ఏరియాలో నూతన ఓసి (పూసపల్లి ) పనులు ప్రారంభమైతే ఇక్కడ నుంచి వివిధ ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ అయినా కార్మికులను తిరిగి ఇల్లందుకే రప్పించవచ్చనే ముందస్తు ఆలోచనతో పంపినప్పటికీ అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదని, ఇక తాము డిప్యూటేషన్ పై వెళ్లిన ఏరియాలలోనే విధులు కొనసాగించాల్సి వస్తుందని కార్మికులు కంటతడి పెడుతున్నారు. అంతేకాకుండా కార్మికులను డిప్యూటేషన్ పై బదిలీ చేసిన క్రమంలో సీనియార్టీ ప్రకారం కాకుండా ఒక ప్రధాన గుర్తింపు సంఘం సూచనల మేరకే ఆ ఒక్క కార్మిక సంఘానికి అనుకూలంగా ఉన్నవారిని సుదూర ప్రాంతాలకు పంపకుండా ఇల్లందుకు దగ్గరలో ఉన్న ఏరియాలకు పంపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు చొరవ చూపి పూసపల్లి ఓసి పనులను త్వరితగతిన ప్రారంభించాలని, అందుకు కావలసిన అనుమతులు వచ్చేందుకు స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులు కృషి చేయాలని కార్మికులు వేడుకుంటున్నారు. ఇల్లందు ఏరియా బొగ్గు ఉత్పత్తి తగ్గడం, నూతన ప్రాజెక్టు కాలయాపన వల్ల ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేసిన కార్మికులను మరల ఇదే ఏరియాకు వచ్చేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

## ఇల్లందు ఏరియాకు పొంచి ఉన్న ముప్పు..?

ఇల్లందు ఏరియాలో బొగ్గు నిక్షేపాలు తగ్గడం, నూతన ప్రాజెక్టులు రాకపోవడం వల్ల ఇల్లందు ఏరియాకు ముప్పు పొంచి ఉందనేది తెలుస్తుంది. సాధారణంగా ఒక ఏరియాలో బొగ్గు నిక్షేపాలు తగ్గుతున్న క్రమంలోనే ముందస్తుగా అక్కడి అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అదే ఏరియాలో ఎక్కడ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయో సర్వే నిర్వహించడం జరుగుతుంది. ఆ సర్వే ఆధారంగా యాజమాన్యం ఆ నూతన ప్రాజెక్టు అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వంలోని ఆయా శాఖలకు ప్రాజెక్టు అనుమతుల కోసం నివేదికలను పంపిస్తారు. ఆ నివేదికలకు సంబంధించిన అనుమతులు కాలయాపన కాకుండా నిత్యం సింగరేణి సంస్థ ఉన్నతాధికారులతో పాటు స్థానిక అధికారులు కూడా సమీక్ష సమావేశాలు నిర్వహించి, అనుమతుల కోసం మరేమైన వివరాలు పంపించాల్సి వస్తుందా లేదా అనేది అధ్యయనం చేయడం జరుగుతుంది. కానీ ఇల్లందు ఏరియాలో మాత్రం గతంలో పనిచేసిన అధికారులకు ఉన్న శ్రద్ధ ప్రస్తుత అధికారులకు లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇల్లందు ఏరియా మనుగడ కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ప్రాతినిధ్య సంఘ నాయకులు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, కారంబికి సంఘ అగ్ర నాయకుల దృష్టికి తీసుకు వెళ్తున్నట్టు సమాచారం. గుర్తింపు సంఘం కూడా వారి వారి స్థాయిలో ఇల్లందు ఏరియా మనుగడ కోసం కృషి చేస్తున్నట్టు తెలుస్తుంది.

ఏదిఏమైనా ఇప్పటివరకు నూతన ఓసికి అనుమతులు రాలేదని అధికారులు చెప్పడం వెరసి, ఇల్లందు ఏరియా మనుగడ కోసం సింగరేణి యాజమాన్యం ఎలా స్పందిస్తుందో.. ప్రాతినిధ్య సంఘం మినహాయించి, మిగిలిన కార్మిక సంఘాల వైఖరి ఏమిటోనన్న ఉత్కంఠ కార్మికులతో పాటు ప్రజల్లో నెలకొంది. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు మనుగడ కొనసాగుతుందా.. లేక చరిత్ర పుటల్లో నిలువనుందా అనేది తెలియాలంటే వేచి ఉండాల్సిందే..